# జాగరూకుడు

చెప్పకుండా పెట్టకుండా వచ్చిపడింది రామలింగంపైన బంధువుల మూకగాదు. ట్రాన్స్ఫరు ఆర్డరు!

ఐనా రామలింగానికి ఆనందమే కలిగింది. వచ్చింది ట్రాన్స్ఫరే అయినా అమావాస్యతో కలిసివచ్చిన తద్దినంలా దానిలో ప్రమోషనుగూడా అంతర్లీనమై ఉండడమే అందుకు కారణం.

అందరూ ఉద్యోగాలు చేయడం వేరు, రామలింగం ఉద్యోగం చేయడం వేరు. అసలు ఏ పనైనా మెలకువతో చేయడం రామలింగం స్వభావం. ఆ మాటకొస్తే మెలకువా, దూరదృష్టి అలాటివన్నీ కలిసికట్టుగా వచ్చి యితఃపరం బెరుగమని రామలింగాన్ని ఆశ్రయించాయనిగూడా చెప్పుకోవచ్చు. అంతెందుకూ, ఏరు ఏడామడల దూరంలో ఉందని చెప్పండి పంచ పై కెగగట్టి రామలింగం ఆ క్షణంనుంచే అప్రమత్తుడై పోతాడు!

మానవుడు తెలివితేటలు కలిగి వుండడం వేరు, అవి తనకున్నాయన్న ఎరుకను కలిగి ఉండడం వేరు. రామలింగం దగ్గర ఈ రెండు గుణాలూ పుష్కలంగా ఉన్నాయి.

రామలింగం ఉద్యోగ నిర్వహణకొక ఉపమానం కోసం ఆలోచించినట్టయితే నూటనాలుగు డిగ్రీల టైఫాయిడ్ జ్వరం తటాలున స్ఫురిస్తుంది. శరీరంపైన స్పృహ ఉన్నంత వరకూ రోగికి తనకు జ్వరం కాస్తుందన్న విషయం తప్పితే మరొక ధ్యాస ఉండదు. ఆ స్పృహ దప్పిన తర్వాత పలవరింపులూ, కలవరింతలూ ప్రారంభమౌతాయి. రామలింగాన్ని ఆవేశించిన ఉద్యోగజ్వరంలో గూడా అలాగే రకరకాల పలవరింపులూ, కలవరింతలూ ఉన్నాయి. వాటిల్లో ముఖ్యమయినది ప్రమోషను కలవరింత!

ఆఖరుకు ఎలాగైతేనేం రోగికోరిన పథ్యాన్నే వైద్యుడు అనుగ్రహించినట్లు రామలింగానికి ఉన్నట్టుండి ప్రమోషను లభ్యమైంది!

కవరులోనుంచి బయటపడిన కాగితాన్ని ఒకటికి రెండుసార్లు చదువుకున్నాడు రామలింగం. ఐనా తన కళ్ళను తనే నమ్మడం ఏమంత సబబని యిద్దరు ముగ్గురు సహోద్యోగులకు చూపించాడు. వాళ్ళందరూ ప్రత్యక్షరాన్నీ పరిశీలించి, రామలింగానికి ప్రమోషను వచ్చినమాట అక్షరాలా నిజమేనని ఏకగ్రీవమైన నిర్ధారణకు వచ్చారు.

'దొరకదు, దొరకదు' అనుకున్న పెన్నిధి దొరికిన తర్వాతనే అసలు సమస్య ప్రారంభమౌతుంది గాబోలు! ఆ పెన్నిధిని భద్రపరచడమెలాగన్నదే ఆ సమస్య. సరిగ్గా రామలింగాన్ని గూడా అలాటి గడ్డు సమస్య ఒకటి ఎదుర్కొంటోంది. నాలుగు రోజుల్లో తను కొత్త ఉద్యోగాన్ని వప్పగించుకోవాలి. ఆ లోపల ఇక్కడి పనులన్నీ పూర్తిగావాలి. ఉపకరణాలను పదిలపరచడంలోనూ, రిజిష్టర్లు మెయింటెయిన్ చేయడంలోనూ తనకేకోశానా ప్రాలుమాలిక లేదుగనుక తను ఆఫీసునుంచీ రిలీవుగావడ మేమంత కష్టంగాదు. కానీ తనీవూరినుంచీ బయటపడడ మెలాగన్నదే యిప్పుడు జవాబుదోచన చిక్కు ప్రశ్న! అర్ధరాత్రివేళ చడీచప్పుడూ గాకుండా పొలిమేరలు దాటుకుంటే దాటుకోవచ్చు. కానీ తనకు ట్రాన్స్ఫరు వచ్చిన సంగతి గాలిలా వూళ్ళో వ్యాపించిందనీ, ఆ వార్త చెవిని బడిన తర్వాత వీళ్ళు తనపైన తీవ్రమైన నిగా వేసివుందరనీ అనుకోడానికి వీల్లేదే! ఒకవేళ

చచ్చీచెడి ప్రస్తుతానికి గండం గడిచి బయటపడినా, వీళ్ళు తనను వెంటాడి ఆ కొత్తవూళ్ళో తన పరువు ప్రతిష్ఠలను రచ్చబండపైన వేలం వేయడానికి పూనుకోరని నమ్మకమేముంది? అబ్బే, అసలే తనది అపరబుద్ధి! అది చెప్పినట్టల్లా వినడం కంటే కొరివితో తలగోక్కోడమే మేలు!

కుర్చీలో కూర్చున్న రామలింగానికి క్షణ క్షణానికీ చిరాకు హెచ్చిపోతోంది. మొదట ఈ చిరాకును వదిలించుకుంటే గానీ ఆలోచన ముందుకు సాగేట్టులేదు...

ఆఫీసులో వున్నంతసేపూ ఈ చిరాకును వెలుపలికి విరజిమ్మడానికి తన కెలాటి అవకాశమూ లభ్యంకాదని రామలింగానికి తెలుసు. హద్దు మీరితే ఆఖరుకు బంట్రోతు గాడు కూడా 'నువ్వెంత, నీ తాహతెంత' అని తిరగబడడానికి వెనుదీయడు. అందువల్ల యిప్పుడున్న దొక్కటే ఉపాయం...

ఆఫీసు వదలి పెట్టి చరచరా యింటికి వచ్చాడు రామలింగం.

"ఏమేవ్! ఇలారా" భార్యను కేకవేశాడు.

అన్నంలో తిప్పుతున్న గరిటెను అలాగే చేతబట్టుకుని కంగారుతో తబ్బిబ్బు లౌతూ భర్త ఎదుటకు పరతెంచి వచ్చింది సుబ్బలక్ష్మి.

"అదేమిటండీ! వేళకాని వేళప్పుడు ఇలా వచ్చేశారు? ఏం జరిగింది?"

"ఏం జరగాలో అదే జరిగింది! రావలసిందేమో వచ్చింది. రాగానే ఏమైంది? ముందు నుయ్యి, వెనుక గొయ్యి, నాలుగు రోజుల్లో అక్కడికి వెళ్ళాలి. ఎలా వెళ్ళడం? ఏం చేయడం? ఆడదానిమాట వినవే వినగూడదు. విన్నానా? విన్నందుకు తగినశాస్తి జరిగింది?"

ఇప్పుడు వచ్చిందేమిటి? నాలుగురోజుల్లో ఈయన ఎక్కడికి వెళ్ళాలి. ఈయన ఆడదానిమాట విన్నా నంటున్నారు గదా! ఏ ఆడదానిమాట? ఎప్పుడు విన్నారు? ఏమీ అర్థంగావడం లేదు సుబ్బలక్ష్మికి. చదువగానే అర్థం బోధపడకుండా చదివిన కొద్దీ క్రొత్త క్రొత్తగా అర్థాలు బోధపడే ఖండ కావ్యంలాంటిది రామలింగం ప్రసంగం. పదేళ్ళ సాహచర్యం మాట దేవుడెరుగుగానీ, భర్త మాటల ధోరణి సుబ్బలక్ష్మికి ఏమీ అర్థంగాకుండా నిత్యనూతనంగానే ఉంటోంది!

"అదిగో! బుంగముఖం పెట్టేశావు! నీ బుర్రకెక్కితేగదూ? నాకు ట్రాన్స్ఫరూ, ప్రమోషనూ రెండూ ఒక్కసారిగా వచ్చాయే వెర్రిమొగమా!"

"అబ్బబ్బ, ఉత్తిపుణ్యానికి ఎంత గాబరం పెట్టేశారండీ! ఇంకేం బిచాణా సర్దుకుంటే సరిపోతోంది!"

"ఊఁహూ! బిచాణా సద్దుకుంటావూ? అంత తేలిగ్గా ఉందన్నమాట నీకీ వూరువిడిచి వెళ్ళడం? అసలు నిన్ను బస్సులో ఎక్కనిస్తారా అంట!"

"ఎక్కనివ్వరూ! ఎవడికండీ అన్ని గుండెలు?..."

"తెలుసు తెలుసు వీరనారి ఝాన్సీరాణి అటు, నువ్విటు! కానీ నీకు కొన్ని సంగతులు బొత్తిగా తెలియడం లేదు. మునుపటి కెవతో వాల్మీకి పెళ్ళాంగూడా ఇలాగే 'నువ్వు దొంగతనం చెయ్, దోపిడీ చెయ్, దాంతో నాకు సంబంధం లేదు. నాకు నా పొట్ట నిండితే చాలు, నా అవసరాలు తీరితే చాలు' అన్నదట!"

"ఇప్పుడే నే నేమన్నానండీ!"

"ఇంకేమనాలి? శెట్టిగారి కొట్లో వంద రూపాయలు అప్పుందని తెలియదూ? బట్టలకొట్టుకు అరవై రూపాయలు ఇచ్చుకోవాలని తెలియదూ? ఇవి గాక చిల్లర బాకీలు

వందరూపాయలదాకా వున్నాయని తెలియదూ? వాళ్ళ డబ్బు వాళ్ళకు అణాపైసలతో సహా ముట్టితేగానీ మనల్ని ఇల్లు కదలనివ్వరని వూహించుకోలేవూ?"

"నిజమే కాదండీ మరి? ఎవరి జాగ్రత్తవాళ్ళది!" గోడకు చేరగిలబడి పైకప్పుకేసి చూస్తూ పరధ్యానంగా అనేసింది సుబ్బలక్ష్మి.

"అన్నావూ? చెప్పానుగా! ఇదంతా ఆ వాల్మీకి పెళ్ళాం తరహాయేనని! ఒక వైపున అప్పులు చేస్తూ, మరొక వైపున వచ్చిన జీతమంతా మిగిలించి, ఓ గొలుసు చేయించి నీ మెడలో వేస్తే అందుకు నువ్వు నాకిచ్చే కితాబు యిదన్నమాట...!"

అంతకూ ఇంతకూ కంటనీరు బెట్టుకోవడం సుబ్బలక్ష్మి స్వభావం. చీర చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ ఆమె "నాకు గొలుసు కావాలని నేనెప్పుడైనా అడిగానటండీ! ఎలాగోలాగ సంసారం గడుపుకపోతే చాలునని నేనంటే మీ అంతకు మీరే గొలుసు చేసి పెట్టారు..."

"అయితే అదీ నా తప్పేనన్న మాట!"

"పోనీ, తప్పంతా నాదేననుకోండి. ఇప్పుడీ గొలుసును అమ్మి ఆ అప్పు లిచ్చేస్తే సరిపోదూ!"

"ఇదిగో సుబ్బులూ! నీ కంటికి నేనంత చేతకాని వాడిలా కనిపిస్తున్నాను గదూ?"

"నా వల్ల కాదు బాబూ! మీకొక నమస్కారం. తలకు వేస్తే మొలకు, మొలకు వేస్తే తలకు! అవతల ఆ అన్నం చిమిడిపోయిందో ఏమిటో..." వంట గదివైపు పరుగెత్తి పోయింది సుబ్బలక్ష్మి.

"ఇదిగో, పోదువుగానీ ఆ గొలుసు తీసి ఇలా యివ్వు."

"ఎందుకూ?"

"అందుకు కాదులే! మరొకందుకు" రెండు పేటల బంగారపు గొలుసును జేబులో వేసుకుని గడపదాటి వీథిలో పడ్డాడు రామలింగం.

ప్రతి చిన్న విషయానికి బెంబేలు పడిపోతున్నట్టే కనిపించినప్పటికీ, ఈ తెచ్చికోలు కంగారుకూ, ఆందోళనకూ అట్టడుగున రామలింగం గొప్ప లౌకికుడు. వెనుకా ముందూ చూడకుండా అప్పులు చేస్తూ, చేసిన అప్పుల్ని చెల్లించే ప్రయత్నాన్ని ఎప్పటికప్పుడే వాయిదా వేసుకుంటూ కాలహరణం చేయడానికెన్ని వుపాయాలున్నాయో, అన్ని వుపాయాలూ రామలింగానికి క్షుణ్ణంగా తెలుసు. అలా కాకుండా బెడిసికొట్టి తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు చెల్లించవలసి వచ్చినప్పుడు డబ్బు పుట్టించుకునే వుపాయాలు గూడా రామలింగానికి తెలిసినవే! ఏ విధంగా చూచినా రామలింగం జాగరూకుడు!

రామలింగం బయల్దేరింది జగన్నాథంగారింటికి. సమయానికి జగన్నాథంగారు యింటిపట్టున్నే వుండడమూ, తనను సాదరంగా ఆహ్వానించి విశేషాలేమిటని అడగడమూ రామలింగానికి సానుకూల సూచనలుగా గోచరించాయి.

"మరేం లేదండీ! ఒక చిన్న సహాయం కావలసివచ్చి..." అంటూ మెల్లగా ప్రారంభించాడు రామలింగం.

"చెప్పండి. సందేహమెందుకూ?" అన్నారు జగన్నాథంగారు.

"ఉన్నట్టుండి నాకు ట్రాన్స్ఫరు వచ్చింది..."

"మీకా! ఆఫీసులో అందరుండగా మీకెందుకు వచ్చిందండీ ట్రాన్స్ఫరు?"

"పైగా ప్రమోషనుగూడా లెండి!"

"ఓహో, అలాగా! చూచారా రామలింగం గారూ! మీరు వెళ్ళిపోతున్నందుకు విచారం, ఐనా ప్రమోషను వచ్చి వెళ్తున్నందుకు సంతోషం – రెండూ ఒక్కసారిగా కలుగుతున్నాయి నాకు. అందుకే కాబోలు పెద్దలంటుంటారు – సుఖ దుఃఖాల్లో దేనికి దాన్నే వేర్వేరుగా అనుభవించడానికి వీల్లేదని! అవి పాలూ నీరులా కలిసి వుంటాయి. మనం మానవులం, ఆ మిశ్రమాన్ని సేవింపవలసిందే! తప్పదు."

ఈ సభ మెప్పు మాటలకేమి లెమ్మనుకున్నాడు రామలింగం. ఐనా, యింత అతి వినయమా? ఔనులే, యిది ధూర్తలక్షణం. పోనీ, ఎవడి పాపాన వాడే పోతాడు మనకేమో మన పని నెరవేరితే చాలు!

"ఈ మధ్య కుటుంబంలో కొన్ని చిక్కులు వచ్చి ఎక్కడ బాకీలు అక్కడే నిలిచిపోయాయి. కామిశెట్టిగారికీ, బట్టల కొట్టు సింగయ్యగారికీ నూటయాభై రూపాయలు యిచ్చుకోవాలి. ఇవిగాక యింకా చిల్లర బాకీలు వంద రూపాయల దాకా వున్నాయి. నగను మీదగ్గరుంచుకుని ఓ రెండువందల రూపాయ లిచ్చారంటే ఈ యిక్కట్టులోనుంచీ కోలుకోగలను…"

"అదేమిటండీ రామలింగంగారూ! ఏదో సహాయమంటూ ప్రారంభించి అచ్చంగా వ్యవహార సరళిలోకి దిగేశారే? యథాశక్తిగా సహాయమైతే చేయగలనుగాని నేను నగలు తాకట్టుంచుకుని అప్పులిచ్చేవాణ్ణిగానే!"

రామలింగానికి తన పాదాలక్రింద నేల కరిగిపోయి బోర్లగిలపడిపోతున్నట్టు తోచింది. అమ్మో. ఈ జగన్నాథం ఆకుకందక, పోకకు పొందక తప్పించుకో చూస్తున్నాడల్లే వుంది. ఇతడి ముందరి కాళ్ళకే గనుక బంధాలు వేయలేకపోతే తన పేరు రామలింగమేకాదు!

"అబ్బే తమ విషయం నాకు తెలియదటండీ! ప్రస్తుతం మీ దగ్గర డబ్బు వుండవచ్చు. ఉండకపోవచ్చు. 'రామలింగం మీకు ఇచ్చుకోవలసిన అప్పులకు నేను పూచీపడుతున్నాను' అని మీరు వాళ్ళకొకమాట చెబితే చాలు. ఇక నగ విషయమంటారా! కీడెంచి మేలెంచడం మంచిది. నా పైన మీకు పరిపూర్ణమైన విశ్వాసముంది, నాకు తెలుసు. కానీ నాకు నమ్మకం లేనిదల్లా నాపైన్నే ననుకోండి! మనసు కోతిలాంటి దంటారు. అది వక్రించదని నమ్మకమేముంది? పైగా, నగ మీ దగ్గరుంటే అప్పు సంగతి ప్రతిక్షణమూ జ్ఞప్తిలో వుంటుంది. అంచేత తొందరగా అప్పుతీర్చే మార్గాలను అన్వేషించడానికి వీలుంటుంది…." జేబులోని గొలుసుతీసి టేబిలుపైన వుంచి, గడగడా పాఠం ఒప్పజెప్పి తన తావులో కూర్చున్న బుద్ధిమంతుడైన కుర్రాడిలా నిశ్చలంగా కూర్చున్నాడు రామలింగం.

జగన్నాథంగారు తెల్లబోయారు. కార్యంపైన కన్ను గలిగి వుండడం మంచిదే! కానీ, రామలింగం కొంత నిలకడగా తనను అర్థం చేసుకోడానికి ప్రయత్నించి వుంటే బాగుండేది. ఇతడు తన దగ్గరికి కూడా అప్పుకోసమే వచ్చాడు. ఇస్తాను, యివ్వను అన్నమాట తన నోటినుంచి రాకమునుపే నగను గురించి ప్రస్తావించాడు. పైగా, తనకు నమ్మకం లేనిది తనపైన్నేననీ బకాయిస్తాడు!

నిజానికి జగన్నాథంగారు తాకట్టులేకపోయినా అప్పులివ్వగలరు. తోడి మానవులపైన ఆయనకాపాటి విశ్వాసముంది. కాదుగీదని ఏ మొండి ఘటమైనా ఎగ్గొట్టడానికి ప్రయత్నిస్తే చెవులు పిండి తన డబ్బును వసూలు చేసుకునే తాహత్తు గూడా జగన్నాథంగారికి కద్దు!

కానీ, ఇంత తెలివితేటలను ఒలకబోసిన రామలింగంతో ఎక్కువగా మాట్లాడ్డం జగన్నాథంగారి కిష్టం లేకపోయింది. ఆయన గొలుసు చేతికి తీసుకుంటూ "అలాగే

వాళ్ళతో చెబుతానులెండి రామలింగంగారూ! ఐతే, ఒక విషయం. మీ రూహించినట్లు ప్రస్తుతం నాదగ్గర డబ్బులేదు. వీలు చూచుకొని మీరు డబ్బు పంపండి. ఎవరి డబ్బు వాళ్ళకు ముట్టజెప్పి నేను మీ నగను మీకు చేరవేస్తాను. అంటే, ఈ లావాదేవీలో నేను మధ్యవర్తిని మాత్రమే నన్నమాట!" అంటూ మునిగినట్టే మునిగి తేలి గట్టున కూర్చున్నాడు.

ఈ సారి తెల్లబోవలసిన వంతు రామలింగానికి వచ్చింది. ఐనా, అతడు తేలుకుట్టిన దొంగలా కాసేపు గుటకలు మ్రింగి "అలాగలాగే! దయ వుంచండి. సెలవిప్పిస్తే వెళ్ళొస్తాను" అంటూ పైకి లేచాడు.

* * *

రామలింగం ట్రాన్స్‌ఫరు వచ్చిన వూరికి వెళ్ళాడు. ఉద్యోగంలో ప్రవేశించాడు. ప్రతిరోజూ ఆఫీసుకు వెళ్ళివస్తున్నాడు – కానీ ఇవన్నీ నిద్రలాంటి అవస్థలో జరిగిపోతున్న పనులు. శరీరం యాంత్రికంగా ఈ పనులన్నీ చేసుకుపోతుండగా మెలకువలో మెలకువగా ఉన్న అతడి బుర్రలోని ఆలోచనలన్నీ అప్పుతీర్చడమెలాగన్న ప్రశ్నపైన్నే కేంద్రీకరింపబడ్డాయి. నెలసరి కుటుంబ వ్యయంపైన అతడొక పర్యాలోకనం జరిపి నిర్దాక్షిణ్యంగా అవసరపు ఖర్చులన్నింటినీ కత్తిరించి పారేశాడు. రోజులు తరబడీ మార్కెట్టు ముఖం చూడకపోయినా తిండి దిగకపోదనీ, ఆకలి గొన్న కడుపుకు గంజే అమృతమని భార్యకు నచ్చజెప్పాడు. "పొదుపు పొదుపు అని పదేళ్ళ నుంచీ చెబుతుంటే నీకు అర్థమైంది గాదు. ఈ రోజు వంగదేశం ఆలోచించింది, రేపు భారతదేశమంతా ఆలోచిస్తుందని ఒక సామెత వుంది. ఈ మాట ఎంతవరకూ నిజమోగానీ, నేను పదేళ్ళకు మునుపు చెప్పిన మాటనే ఇప్పుడు గవర్నమెంటు చెబుతోంది" అంటూ ప్రభుత్వం వారి పొదుపు కార్యక్రమ పథకాన్ని తన వాదానికి వూతగా తీసుకున్నాడు. ఉదయం పది గంటలకల్లా భోజనంచేసి తను ఆఫీసుకు వెళ్ళిపోయిన తర్వాత యింటికి పెరటికీ చెదదిరిగి శరీరానికి లేనిపోని అలత పెట్టుకోకుండా శుభ్రంగా ఒకచోట కూర్చుని విస్తర్లు కుట్టుకోడం ఎంత మంచిపనో సహధర్మచారిణికి విశదీకరించాడు. ఇరుగు పొరుగు అమ్మలక్కలను గూడా యింటికి చేరదీసి ఎవరి కిష్టమైన మాట వారికి చెప్పి, నాజూగ్గా పని చేయించుకునే సదుపాయాలను గూడా సూచించాడు.

ఆ యీ జాగ్రత్తల వల్ల రెండు మూడు మాసాల్లోనే అప్పులన్నీ జెలకడిగి వేయడానికి కావలసినంత డబ్బు ప్రోగుచేయగల్గాడు రామలింగం.

ఓ రోజు రాత్రి రామలింగం రెండు గంటలప్పుడు మేలుకున్నాడు. కొంత సేపు పడకపైన అటూ ఇటూ దొర్లి ఆ తరువాత భార్యను గూడా లేపాడు.

"ఏమిటండీ మీరు మరీనూ!" అంటూ సుబ్బలక్ష్మి గోడవైపుకు ఒత్తిగిలిపడుకుంది.

"అదికాదే సుబ్బులూ! ఈ ఆంధ్రప్రదేశం యింత విశాలంగా వుండడం వల్ల ఎన్ని చిక్కులున్నాయో తెలుసా?"

"ఏమిటో నబ్బా! మీకు వెయ్యి ఆలోచనలండీ పాడూ!"

"ఓసి వెర్రిమొగమా! మనం అప్పుతీర్చి మన నగను విడిపించుకోవాలి గదా! అక్కడికి వెళ్ళి రావాలంటే రైలుచార్జీలకే పది రూపాయలు చాలవు. పది పదిహేను రూపాయలు ఎవరు తిన్న పాడో చెప్పు!"

"పోనీ, మనియార్డరు చేసేయగూడదూ!"

"చెయ్యొచ్చు, నాకు అద్దే ఆలోచన. కానీ, మనం పంపిన డబ్బును తన అవసరాలకు వాడుకుని ఆ జగన్నాథం నిమ్మకు నీరెత్తినట్టు కూచుంటే.."

"అందుకిప్పుడేం చేయదలచుకుంటున్నారు?"

"అదే ఆలోచిస్తున్నాను.."

మరునాటి వుదయం రామలింగం పోస్టాఫీసుకు వెళ్ళాడు. నాలుగు కార్డులు కొని ప్రతి కార్డుపైనా " ఈరోజు జగన్నాథంగారికి యమ్.ఓ. ద్వారా డబ్బు పంపుతున్నాను. మీకు నేను ఇచ్చుకోవలసిన బాకీని తక్షణం వారిదగ్గరనుండీ పుచ్చుకోగలరు" అని వ్రాసి పోస్టు చేశాడు. ఒకటి కామిశెట్టికి, మరొకటి సింగయ్యకు, మిగిలినవి మిగిలిన ఋణదాతలకు!

జాబుల్లో సూచించినట్లు ఆ రోజు మనియార్డరు గూడా చేశాడు రామలింగం. కూపనులో "మీ సహాయానికి కృతజ్ఞుణ్ణి. డబ్బు చేరగానే బంగారు గొలుసును రిజిష్టరు పార్సెలు ద్వారా పంపగోరుతున్నాను." అని సంతకంతో పూర్తి చేశాడు.

వీధినాటకంలో రాజుగారి రాకను తెలిపే చోపుదారికిమల్లే ఈ జాబులన్నీ మనియార్డరుకంటే ముందుగానే చిరునామాదారులకు చేరిపోతాయి. చేరగానే వాళ్ళు జగన్నాథాన్ని ముట్టడించేస్తారు. ఎవరిబాకీ వాళ్ళ కివ్వకుండా ఈ పద్మవ్యూహంనుంచీ ఎలా తప్పించుకోగలడు జగన్నాథం?

* * *

రామలింగం పాలిటికి ఒక్కవారం రోజులు బరువుగా దొర్లిపోయాయి. ఆ వారం పొడుగునా టపాకోసం సరాసరి పోస్టాఫీసు దగ్గరికే వెళ్ళి కాచుకూర్చునే వాళ్ళల్లో రామలింగమూ ఒక్కడుగా జమయ్యాడు. అలా పోస్టాఫీసు ఎదుట గుమిగూడిన వాళ్ళకందరికీ ఏ కార్డులో కవర్లో వచ్చిపడుతున్నాయి. తనకు మాత్రం ఏమీ రావడం లేదు. బావిలో రాయిపడితే బుడగలైనా పైకొస్తాయి. ఆ మాత్రానికైనా నోచుకోలేదా తన మనియార్డరు?

ఆ పరిస్థితిలో అంతకంటే ఓర్పు వహించడం రామలింగానికి దుస్తరమైపోయింది. అంతవరకు తను లోకాన్ని గురించి ఎంతో మంచిగా తలపోసినట్టు, ఉన్నట్టుండి దారుణమైన దాని నగ్న స్వరూపం తన కళ్ళకు పొడబట్టినట్టు అత దూహించుకోసాగాడు. ఆఫీసులో అతడిచేతికి వచ్చిన రిజిష్టర్లలోనూ, ఫైళ్ళలోనూ కొట్లూ దిద్దులూ పెరిగిపోతున్నాయి. క్రింది గుమాస్తాలపైన అతడి రంధ్రాన్వేషణకు ఒక మితమంటూ లేకపోతోంది. ఇంటికెళ్తే సరేసరి, శ్రీమతిపైన ధాముధూములే! ఇక రాత్రుల్లోనా – శపిస్తే కంటికి కునుకుపట్టదు!

త్వరగా వచ్చి చేరకుండా రామలింగాన్ని యిన్ని పాట్లకు అగ్గం చేసిన రిజిష్టరు పార్సెలు, ఓ రోజతడు పోస్టాఫీసుకు బయల్దేరబోతుండగా స్వయంగా తనే యింటిని వెదుక్కుంటూ వచ్చేసింది!

"ఇదిగో సుబ్బులూ! ఎలాగైనా జగన్నాథం మంచివాడే! పార్శెల్ వచ్చేసింది," అంటూ రామలింగం లోపలికి పరుగుతీశాడు.

"ఏదీ, పట్రండి చూద్దాం" అంటూ సుబ్బలక్ష్మి గూడా హాల్లోకి వచ్చేసింది.

రామలింగం కుర్చీలో కూర్చున్నాడు. సుబ్బలక్ష్మి అలమారా తెరిచి పేనాకత్తి తీసుకొచ్చింది.

"చూడ్డానికి ఈ పార్సిలు మరీ పెద్దదిగా వుంది కదండీ!"

"ఉండొద్దూ మరి! అలాగే వుండాలి." పార్శిలును ఛేదించే ప్రయత్నంలో నిమగ్నుడయ్యాడు రామలింగం.

ఒక్కింత శ్రమతో పైమూత వూడిపోయింది. రామలింగం పైపైని తుక్కు కాగితాలు విదిలించేశాడు.

"అదేమిటండీ? ఈ పార్శిల్లో యింకొక పార్శలా!" సుబ్బలక్ష్మి భర్తవైపు ఆశ్చర్యంగా చూచింది.

ఆ మాట నిజమే! చాక్‌పీసుల పెట్టంత సైజులో వున్న మొదటి పార్శిల్లో నుంచి రెండోది బయటపడింది. ఇదొక డబ్బారేకుల పెట్టె!

"మరేమనుకుంటున్నావు జాగ్రత్తపడటమంటే!" రామలింగం ఆ పెట్టెగూడా తెరిచేశాడు. దానిలో ఓ కర్పూరపు బిళ్ళల డబ్బా దృగ్గోచరమైంది.

సుబ్బలక్ష్మి కళ్ళు కుంభాకార కటకాల్లా పైకొచ్చేశాయి. హఠాత్తుగా రామలింగం నాలుక పిడచగట్టుకపోయింది.

ఆ డబ్బా తెరవగానే మళ్ళీ అందులోగూడా ముద్దులు మూటగట్టే మరొక చిన్న పార్శెలు!

"సుబ్బులూ!" తెరిచిననోరు తెరిచినట్టే వుండిపోయింది.

సుబ్బలక్ష్మికి ఎక్కడలేని వుక్రోషం పుట్టుకొచ్చింది. ఆమె ముద్దులు మూటగడ్తున్న ఆ చిన్న పార్శెలును పేనాకత్తితో ఛిన్నాభిన్నంగా కోసేసింది!

దానిలో నుంచీ బయటపడింది బంగారపు గొలుసుకాదు – మామూలు రకం అరవైపుల్లల చీటాఫైట్ అగ్గిపెట్టె!

"ఇంకేం గొలుసు బాబూ?" సుబ్బలక్ష్మి అగ్గిపెట్టె తీసింది. అందులో నుంచీ జాగ్రత్తగా మడతబెట్టిన ఓ చీటీ క్రిందికి జారింది.

"చదువు సుబ్బులూ, ఏం వ్రాశారో చదువు!"

"ప్రియమైన రామలింగంగారూ!

మీరు ఈ వూరినుంచి వెళ్ళిపోవడానికి ముందుగా నన్ను కలుసుకున్నప్పుడు 'నా పైన నాకే నమ్మకం లేదనుకోండి' అంటూ ఓ ఆణిముత్యంలాంటి మాట సెలవిచ్చారు. కానీ అప్పటి మీ మాటలనుబట్టి, ఆ తరువాత జరిగిన సంఘటనలబట్టి ఆలోచించగా మీకు మీపైన తప్పితే మరొకరిపైన నమ్మకం లేదన్న విషయం నా కవగతమైంది. అవకాశం దొరికితే ప్రతి రెండవవ్యక్తీ మోసగాడుగా పరిణమింపవచ్చునని మీరు భావించడం విచారకరం! కొండొకచో అపాయకరం గూడా!

ఈ అమూల్యమైన హితవులు మీకు చేరుతున్న విధానంవల్లనైనా కలకాలం జ్ఞప్తిలో వుండగలవని ఆశిస్తున్నాను.

మీరు ఎదుటివాణ్ణి విశ్వసిస్తే ఎదుటివాడు మిమ్మల్ని విశ్వసిస్తాడు. అది లేనప్పుడు యిదీ లేదు! నిజాన్ని యింత నిర్మొగమాటంగా చెబుతున్నందుకు మన్నించండి. మీ నగ మీకు చేరినట్టుగా రివెన్యూ స్టాంపుమీద సంతకంచేసి మీరు రసీదును పంపిన తక్షణం మీ గొలుసు మీకు రిజిష్టర్డు పార్శల్లో సురక్షితంగా పంపబడును.

ఇట్లు

జగన్నాథం

♦ ఆంధ్ర సచిత్ర వారపత్రిక - 1959 ♦